క్లుప్తంగా

వృద్ధాప్యం శాపం కాకూడదు



వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ బి.శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): మలివయసులో తల్లిదండ్రులకు వృద్ధాప్యం శాపం కాకూడదని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. ఆదివారం ఆయన స్థానిక బి.క్యాంపులోని మన వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ నూతన ఆర్థిక, సామాజిక అంశాలు ఉమ్మడి కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేశాయని, వృద్ధాప్య తల్లిదండ్రుల సంక్షేమాన్ని తమ బాధ్యతగా భావించాలని, వారికి సముచిత గుర్తింపు ఇవ్వాల్సిన బాధ్యత నేటి యువతరంపై ఉందన్నారు.

దేశ భక్తి కలిగి ఉండాలి

కర్నూలు కల్చరల్: ప్రతి ఒక్కరూ దేశ భక్తి కలిగి ఉండాలని ఆర్ఎస్ఎస్ సేవా భారతి కార్యదర్శి ఎం.రఘురాములు అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో హిందూ సామ్రాజ్య దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ రక్షణలో భాగస్వాములు కావాలన్నారు.ఐక్యతతోనే సంఘటిత శక్తి వస్తుందన్నారు. గౌరైల పెంపకం దారుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంఘ్ చాలక్ సూర వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వాస్తవికతతో రచనలు



కేతు విశ్వనాథరెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: సామాజిక వాస్తవికతతో సాహిత్య రచనలు చేసిన తొలితరం కథకులు ఆచార్య కే తు విశ్వనాథరెడ్డి అని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో కేతు విశ్వనాథరెడ్డి సంతాప సభ జరిగింది. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాహితీ వేత్తలు పాణి, వెంకటకృష్ణ మాట్లాడుతూ ఆధునిక కథా సాహిత్యంలో కేతు విశ్వనాథరెడ్డి మార్క్సిస్ట్ ముద్ర వేశారన్నారు. కథాసాహిత్యంలో అనావృష్టి, ఫ్యాక్షన్, దళిత సమస్యలు, స్త్రీవేదనలు కథలుగా రాశారని ఇందులో మార్పుకు అవకాశం ఉన్న శక్తులను అన్వేషించారన్నారు. సాహితీ స్రవంతి అధ్యక్షుడు కెంగార మోహన్ అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో కవులు, రచయితలు ఇనాయతుల్లా, అజీజ్, మారుతి, చౌశా, రాంచంద్, సయ్యద్ జహీర్ అహ్మద్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


పుస్తక పఠనంతో పరిజ్ఞానం



పుస్తక పఠనంలో పాల్గొన్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: పుస్తక పఠనంతో సంపూర్ణ విషయ అవగాహన కలుగుతుందని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆంగ్ల, తెలుగు దినపత్రికల పఠనంతో విజ్ఞానం పెరుగుతుందన్నారు. విశ్రాంత అధ్యాపకులు ఉసేన్‌పీరా పుస్తక సమీక్షపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రామకృష్ణ సేవా సమితి సభ్యులు ముంతాజ్ బేగం కుట్లు, అల్లికలు నేర్పించారు. గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, లైబ్రేరియన్స్ వజ్రాల గోవిందరెడ్డి, బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ టాపర్‌గా కర్నూలు విద్యార్థి



పెరుగు ప్రణీత్‌రెడ్డి

కర్నూలు (హాస్పిటల్): ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ప్రవేశపరీక్షలో కర్నూలుకు చెందిన విద్యార్థి డాక్టర్ పెరుగు ప్రణీత్‌రెడ్డి మొదటి ర్యాంకు సాధించాడు. స్థానిక మాధవీనగర్‌కు చెందిన పెరుగు పురుషోత్తమరెడ్డి కుమారుడైన ప్రణీత్‌రెడ్డి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇటీవల జనరల్ సర్జరీలో పీజీ పూర్తి చేశాడు. జూనియర్ డాక్టర్ల సంఘానికి అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఎయిమ్స్ ప్రవేశ పరీక్ష రాసి మొదటి ర్యాంకు సాధించి సత్తాచాటాడు. ఈ మేరకు ఆయన చండీఘడ్‌లోని ఎయిమ్స్‌లో రీనల్ ప్లాంట్ సర్జరీ (కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స) కోర్సును సూపర్‌స్పెషాలిటీ విద్యలో భాగంగా ఎంపిక చేసుకున్నాడు. అతడిని కర్నూలు మెడికల్ కాలేజీ అధికారులు, వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు.

పర్యవేక్షణ పట్టాలెక్కేనా!

- పట్టాలు తప్పుతున్న రైళ్లు
- ఒడిశాలో రైలు ప్రమాదంతో ప్రజలు బెంబేలు
- గుర్తుకొచ్చిన జిల్లాలోని రైలు ప్రమాదాలు
- 2019లో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన భారీ ముప్పు
- 2021లో సిటీ స్టేషన్‌లో పట్టాలు తప్పిన రైలింజన్
- తరచూ ప్రమాదాలు జరుగుతున్న మేల్కోని రైల్వే శాఖ

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికుల గుండెల్లో 'రైళ్లు' పరుగెడుతున్నాయి. సాంకేతిక సమస్య, నిర్వహణ లోపం తదితర కారణాలతో తరచూ రైళ్లు పట్టాలు తప్పడం..ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం జరుగుతూనే ఉంది. తాజాగా ఒడిశా రాష్ట్రంలోని బాలాసోర్ వద్ద కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పి మహా ప్రమాదం జరగడంతో జిల్లా ప్రజలు ఒక్క సారిగా ఉలిక్కిపడ్డారు. జిల్లాలో గతంలో జరిగిన రైలు ప్రమాద సంఘటనలను గుర్తు చేసుకుంటున్నారు.

జిల్లాలో చోటు చేసుకున్న ఘటనలు

- కర్నూలు రైల్వే స్టేషన్ ఆవరణలో పలుమార్లు రైళ్లు పట్టాలు తప్పాయి. అయితే, ఆ సమయంలో అవి తక్కువ వేగంతో వస్తుండటంతో భారీ ప్రమాదాలు జరగలేదు. 2002లో తుగ్గలి మండలం పెండేకల్లు వద్ద ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పడంతో 26 మంది అక్కడికక్కడే మరణించగా 50 మందికిపైగా ప్రయాణికులు తీవ్ర గాయాలపాలయ్యారు.
- 2021 జూన్ 25న సిటీ స్టేషన్ ఆవరణలో రైలింజన్ పట్టాలు తప్పింది. స్టేషన్ కారణంగా లోకో పైలెట్ ఇంజిన్ వేగాన్ని తగ్గించి వస్తుండగా రైలు పట్టాల తప్పింది. ఆ సమయంలో రైళ్ల రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.
- 2019 మార్చి 3న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ ప్రయాణికుల రైలు చిత్తూరు నుంచి కాచిగూడ వెళ్తూ సిటీ స్టేషన్ సమీపంలో (డోన్ వైపు) పట్టాలు తప్పింది. కోట్ల స్టేషన్, హంద్రీని అప్పుడే దాటడం, స్టేషన్ వస్తుండడంతో రైలు వేగాన్ని లోకో పైలెట్ పూర్తిగా తగ్గించడంతో భారీ ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.
- 2014 మార్చి 17న బెంగుళూరు నుంచి నాందేడ్‌కు వెళ్తున్న యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ అనంతపురం జిల్లా సత్యసాయి స్టేషన్ సమీపంలో అగ్ని ప్రమాదానికి గురైంది. ఇందులో 26 మంది చనిపోగా ఆదోని పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న తండ్రి, కూతురు సజీవ దహనమయ్యారు.
- 2013 ఏప్రిల్‌లో హైదరాబాదు నుంచి కర్నూలుకు వస్తున్న గూడ్స్ రైలు అశోక్ నగర్ బ్రిడ్జి వద్ద పట్టాలు తప్పి పక్కకు ఒరిగింది. అ సమయంలో కూడా స్టేషన్ సమీపిస్తున్న కారణంగా రైలును డ్రైవర్ వేగాన్ని బాగా తగ్గించారు.
- 2008 ఆగస్టులో కర్నూలు స్టేషన్ సమీపంలోనే యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలింజిన్ పట్టాలు తప్పింది. అప్పట్లో కూడా స్టేషన్ సమీపం కారణంగా వేగం అతి తక్కువగా ఉండడంతో ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు.
- 2002 డిసెంబరు 23న తుగ్గలి మండలం పెండేకల్లు వద్ద ఘోర ప్రమాదం జరిగింది. కాచిగూడ నుంచి బెంగుళూరుకు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో 26 మంది అక్కడికక్కడే మరణించగా 56మంది తీవ్ర గాయాలకు గురయ్యారు.

మేల్కోని రైల్వే శాఖ

తరచూ రైలు ప్రమాదాలు జరిగి ప్రాణ, ఆస్తి నష్టం కలుగుతున్నా రైల్వే శాఖ మేల్కొవడం లేదనే విమర్శలున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేయడం, ఘటనపై విచారణకు కమిటీ వేయడం, నివేదికలు వచ్చాక చర్యలు తీసుకుంటామని చెప్పడం పరిపాటిగా మారింది. తర్వాత కమిటీలు ఇచ్చిన నివేదికలు ఏమవుతాయో.. బాధ్యులపై ఎలాంటి చర్యలు ఉంటాయో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా ప్రమాదాల నివారణకు గట్టి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పట్టాలు తప్పిన వెంకటాద్రి రైలును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సేఫ్టీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి



మన ఇండియన్ రైల్వేకి గొప్ప చరిత్ర ఉంది. కానీ, తరచూ రైళ్లు పట్టాలు తప్పుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ప్రయాణికుల్లో ఆందోళన ఉంటోంది. ఈ నేపథ్యంలో రైల్వే అధికారులు సేఫ్టీపై ప్రత్యేక దృష్టి సారించాలి. నిరంతరం పట్టాలు, ఇంజిన్లతోపాటు బోగీల సామర్థ్యం, నిర్వహణ, సాంకేతిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి.

– జి.ఎస్.చాంద్ బాషా, కర్నూలు

భద్రతా చర్యలు చేపట్టాలి



రైల్వే ప్రమాదాలతో ప్రయాణికులు ఉలిక్కి పడుతున్నారు. గతంలో కర్నూలు స్టేషన్‌లోనే రైళ్లు పట్టాలు తప్పాయి. నెమ్మదిగా వెళ్తున్న కారణంగా ఆ సమయంలో ప్రాణ నష్టం జరగలేదు. ఒడిశాలో జరిగిన ప్రమాదం ఆందోళన కలిగించింది. ఇలాంటివి మరోసారి జరగకుండా అధికారులు భద్రతా చర్యలు చేపట్టాలి.

– జి. విజయభాస్కర్ రెడ్డి, కోడుమూరు

కేవీఆర్‌లో స్థల వివాదం కొలిక్కి

- 2012 నుంచి డిగ్రీ, జూనియర్ కాలేజీ మధ్య స్థల సమస్య
- జిల్లా కలెక్టర్ చొరవతో వివాదం పరిష్కారం
- ఎట్టకేలకు జూనియర్ కాలేజీకి స్థలం స్వాధీనం
- నాడు–నేడు పనులకు తొలగిన అడ్డంకి



నగరంలోని కేవీఆర్ జూనియర్ కాలేజీ

కర్నూలు సిటీ: కేవీఆర్ డిగ్రీ, జూనియర్ కాలేజీల మధ్య స్థల వివాదం సమిసినట్టే. దశాబ్దకాలంగా సాగిన ఈ సమస్యను జిల్లా కలెక్టర్ డా.జి సృజన ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించడంతో నాడు–నేడు పనులకు అడ్డంకి కూడా తొలగింది.

ఇదీ నేపథ్యం..

కేవీఆర్ జూనియర్ కాలేజీ 1958లో ప్రీ యూనివర్సిటీ కోర్సుగా ప్రారంభమైంది. 1962–63 విద్యా సంవత్సరంలో డిగ్రీ కాలేజీగా అప్‌గ్రేడ్ అయ్యింది. 1969లో ఇంటర్మీడియెట్‌గా మార్పు చేయగా, 1996లో కాంపొజిట్ కాలేజీగా డిగ్రీ పరిధిలోనే జూనియర్ కాలేజీ ఉండేది. డిగ్రీ, ఇంటర్ వేరుగా చేసినప్పుడు స్థలం, స్టాఫ్ విభజన చేయకపోగా, 2012లో జూనియర్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్‌ను తొలగించారు. దీనిపై జూనియర్ కాలేజీ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ తమకు న్యాయం చేయాలని కోరుతూ 2015లో పోస్టుకార్డులు రాసి హైకోర్టుకు పంపారు. ఫిర్యాదుగా స్వీకరించి విచారణ చేపట్టిన హైకోర్టు జూనియర్ కాలేజీకి ఎకరం స్థలం, హాస్టల్ సదుపాయం కల్పించాలని 2016లో తీర్పు ఇచ్చింది. ఇది అమలు కాకపోవడంతో విద్యార్థులు మరోసారి కోర్టును ఆశ్రయించగా వెంటనే కాలేజీలోని నార్త్ వెస్ట్‌లో 2 ఎకరాలు కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు 2019లో స్థలాన్ని కల్లూరు తహసీల్దారు కొలతలు వేసి స్వాధీనం చేశారు. ప్రస్తుతం జూనియర్ కాలేజీకి నాడు–నేడు పనుల కింద రూ.94 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో టాయిలెట్లు, తరగతి గదుల్లో మేజర్, మైనర్ రిపేర్లతో పాటు రక్షణగోడ నిర్మాణం చేయాలి. అయితే, ఈ పనులకు డిగ్రీ కాలేజీ వారు అడ్డుకోవడంతో మళ్లీ సమస్య మొదటికొచ్చింది. ఇటీవల కలెక్టర్ సృజన నిర్వహించిన సమీక్షలో స్థల వివాదం గురించి తెలియడంతో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. డిగ్రీ, జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లతో మాట్లాడి వివాదాన్ని పరిష్కరించాలని సూచించడంతో కర్నూలు ఆర్డీఓ, సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్, ఇంజనీర్లు కాలేజీకి వెళ్లి స్థలాన్ని జూనియర్ కళాశాలకు స్వాధీనం చేశారు. దీంతో నాడు–నేడు పనులతో పాటు తరగతి గదుల నిర్మాణాలకు అడ్డంకులు తొలగిపోయాయి.

ఔషధాల నేరేడు



నగరంలో విక్రయిస్తున్న నేరడు పండ్లు

కర్నూలు (న్యూసిటీ) : కాలనుగుణంగా మార్కెట్లో వచ్చే ఎన్నో పండ్లు రుచితోపాటు ఆరోగ్యానిస్తాయి. అలాంటి వాటిలో నల్ల నేరేడు ఒకటి. ఈ సీజన్లో విరివిగా దొరికే ఈ పండ్లను రుచి చూడని వారుండరూ. అందుకే మార్కెట్లో కనిపించగానే వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి చిరువ్యాపారులు నల్ల నేరేడు పండ్లను జిల్లా కేంద్రం కర్నూలుకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో ఈ పండ్లు కిలో రూ. 150 నుంచి రూ.200 వరకు ధర పలుకుతున్నాయి. ఆయుర్వేదంలో నల్ల నేరేడు పండ్లను సంజీవని అని పిలుస్తారు. ఈ పండ్లతో పాటు ఆకులు, గింజలు, చెట్ల బెరడు ఔషధాల తయారీలో వాడుతారు. ఈ చెట్టు కాయల నుంచి వెనిగర్ తయారు చేస్తారు. ఈ పండ్లను తింటే జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. మధుమేహం, నోటిపూత, చిగుళ్ల వ్యాధులు, దంతక్షయం, మూత్రంలో మంట తదితర సమస్యల నివారణకు ఈ పండ్లు చక్కటి ఔషధంగా పని చేస్తాయి. నేరేడు లో విటమిన్ ఏ,సీ అధికంగా ఉండటంతో ఇది రోగ నిరోధక శక్తిని పెంచడంతో పాటు శరీరంలో చెడు కొలెస్ట్రాల్, అధిక బరువును తగ్గించడంలో సహాయపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

వినియోగదారులకు అందుబాటులో ఉండండి

కర్నూలు(రాజ్‌విహార్): ఈదురు గాలులు, వర్షాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు వినియోగదారులకు అందుబాటులో ఉండి పునరుద్ధరణ పనులు చేపట్టాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం కావడంతో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ పనులు చేసే సమయంలో తప్పనిసరిగా అర్త్ వేసుకోవడంతో పాటు హెల్మెట్ ధరించాలని చెప్పారు. విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

ఖిల్లాను సందర్శించిన ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



కొండపల్లి ఖిల్లాపైన మ్యూజియంలో కోట చరిత్రను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కర్నూల్ నగర ఎమ్మెల్యే మహ్మద్ అబ్దుల్ హఫీజ్ ఖాన్ శనివారం రాత్రి కొండపల్లి ఖిల్లా కోటను సందర్శించారు. కోటలో పురావస్తు శాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ గ్యాలరీని పరిశీలించారు. కొండపల్లి కోట, రాజరిక చరిత్రను అడిగి తెలుసుకున్నారు. కొండపల్లి ఫోర్ట్ యాప్ ద్వారా ఆనాటి రాజుల చరిత్ర, వారి చేసిన వ్యాపార అభివృద్ధి పనులు, పరిపాలన అంశాలను ఆసక్తిగా పరిశీలించారు. కొండపల్లి కోటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన లేజర్ షోను తిలకించారు. ఆయన మాట్లాడుతూ కొండపల్లి కోట, మ్యూజియం, లేజర్ షో తనను విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. ఇదే మాదిరిగా కర్నూలు కొండారెడ్డి బురుజు కోటలో లేజర్ షో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఆయన వెల్లడించారు.

బరువు తగ్గించుకుంటే షుగర్ నియంత్రణ



డాక్టర్ భరత్‌ను సన్మానిస్తున్న హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): శరీరంలోని అధిక బరువును 15 కిలోలు తగ్గించుకుంటే షుగర్‌ను పూర్తిగా నియంత్రణలోకి తీసుకురావచ్చని ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ భరత్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో షుగర్ వ్యాధిపై ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భరత్ మాట్లాడుతూ బ్రిటన్‌లో ఇటీవల డైరెక్ట్ టెస్ట్ అనే పరిశోధన చేశారన్నారు. అందులో పలువురు షుగర్ వ్యాధిగ్రస్తులను ఎంపిక చేసి వారికి అవసరమైన డైట్, వ్యాయామం ద్వారా శరీర బరువును 15 కిలోలు తగ్గించి చూశారని తెలిపారు. దీనివల్ల అప్పటి వరకు ఉన్న షుగర్ పూర్తిగా నియంత్రణలోకి రావడమే గాక మందులు కూడా అవసరం లేని పరిస్థితి నెలకొందన్నారు. భారతీయులు సన్నగా ఉన్నా వారిలో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటోందని, అందుకే షుగర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఇక్కడ అధికంగా ఉంటోందన్నారు. ప్రతి ఒక్కరూ వారి బాడీ మాస్క్ ఇండెక్స్‌ను అనుసరించి శరీర బరువు ఉండాలన్నారు. టైప్ 1 డయాబెటీస్ పుట్టుకతో, టైప్–2 డయాబెటీస్ వంశపారంపర్యంగా, జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా వస్తోందన్నారు. షుగర్ వ్యాధిని నియంత్రణలో ఉంచుకోవాలంటే అధిక బరువును తగ్గించుకోవడం, ఇందుకోసం వారంలో 300 నిమిషాల పాటు వ్యాయామం చేయడం, తక్కువ కేలరీలు ఉన్న ఆహారాన్ని తినడం, తెల్ల అన్నం బదులు తృణధాన్యాలను తీసుకోవడం చేయాలన్నారు. అనంతరం ఆయనను హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, సభ్యులు వెంకటరాముడు, లక్ష్మన్న, ఐఎస్ఓ ప్రతినిధి ఇలియాజర్, రిటైర్డ్ డీఎస్పీ పాపారావు తదితరులు ఘనంగా సన్మానించారు.

ఆయుష్మాన్ హెల్త్‌కార్డులు అందరికీ ఇవ్వాలి



మాట్లాడుతున్న డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు అందరికీ ఇచ్చి పోర్టబులిటీ సౌకర్యం కల్పించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి యోజన, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఎంపానల్ హాస్పిటల్‌కు సంబంధించి కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ఆరోగ్య సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బగేలాతో పాటు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని హాజరైన ఈ సమావేశంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గురించి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి వివరించారు. ప్రసవాల కోసం తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల ప్రజలు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తుంటారని, వారికి ఆయుష్మాన్ భారత్, తెలంగాణ ఆరోగ్యశ్రీ కార్డులు ఇక్కడ చెల్లుబాటు కావన్నారు. దీనివల్ల వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అంతేగాక జాతీయ రహదారి 44 కర్నూలు మీదుగా వెళ్తుందని, ఇక్కడ జరిగే రహదారి ప్రమాదాల్లో గాయపడిన వ్యక్తులకు సత్వర వైద్య సదుపాయం అందించేందుకు ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు అందరికీ ఇచ్చేటట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఈ రోజు

పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని కోడుమూరు రోడ్డులో సోమవారం మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాబా బృందావన్ నగర్, ఫోర్ట్ టౌన్ పోలీస్ స్టేషన్, నిర్మల నగర్, గురురాఘవేంద్ర నగర్, ఠాగూర్ నగర్, గోపి నగర్, యాదవ నగర్, విద్యుత్ ఎంప్లాయిస్ కాలనీ, మల్లారెడ్డి హోమ్స్–1, 2, రేడియో స్టేషన్ ప్రాంతం, ప్రియా హోమ్స్–1, 2, హ్యాపీ హోమ్స్, విష్ణు టౌన్ షిప్, ఆటో నగర్, పెద్దపాడు, నెరవాడ, రాజీవ్ స్వగృహ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గడప గడపకూ మనప్రభుత్వం

కర్నూలు (న్యూటౌన్): నగర పరిధిలోని బాలాజీనగర్‌తో పాటు కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

స్పోర్ట్స్

కిక్ బాక్సింగ్‌లో రాణించాలి

కర్నూలు (రూరల్): విద్యార్థులు కిక్ బాక్సింగ్‌లో రాణించాలని ప్రముఖ విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, ఆర్కా హాస్పిటల్ అధినేత త్రినాథ్ కోరారు. ఆదివారం డాక్టర్ కాలనీలోని త్రినాథ్ అకాడమీలో సమ్మర్ క్యాంప్ ముంగిపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కోచ్ నరేంద్రాచారి, నాగేంద్ర పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: నగరంలోని సెయింట్ మేరీస్ తెలుగు మీడియం (చిన్నపార్క్)పాఠశాలలో ప్రవేశాలకు మూగ, చెవిటి పిల్లల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపల్ నిర్మల జ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలు ఉంటాయని, ఈ నెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7893999236, 9110329988, 7780317454 నంబర్లను సంప్రదించాలన్నారు.

11న ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి సంబంధించి ఈ నెల 11న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ దిల్షాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలోనే ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాత పరీక్ష ఉంటుందన్నారు.

ఆధ్యాత్మిక సమాచారం

ధార్మిక విలువలు పెంపొందించాలి



అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: ధార్మిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉందని ఇస్కాన్ ప్రవచకులు వైష్ణో చైతన్య ప్రభు అన్నారు.ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత తరగతులు నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం ఆయన సందేశమిస్తూ ధార్మికతను, ఆధ్యాత్మికతను కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ప్రశాంతత కలుగుతుందన్నారు.

పంచభూత లింగ క్షేత్ర యాత్రకు ప్రత్యేక బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): పంచభూత లింగ క్షేత్రాల దర్శనం కోసం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు నడపనున్నట్లు కర్నూలు–1 డిపో అసిస్టెంట్ మేనేజరు సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో కాణిపాకం (వినాయకుడు)తో పాటు పంచభూత లింగ క్షేత్రాలు అరుణాచలం (అగ్ని లింగం), జంబుకేశ్వరం (జల లింగం), చిదంబరం (ఆకాశ లింగం), కంచి (పృథ్వీ లింగం), శ్రీకాళహస్తి (వాయు లింగం) క్షేత్రాల దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ యాత్రకు ఈ నెల 9వతేదీన రాత్రి 8గంటలకు కర్నూలు నుంచి బస్సు బయలుదేరుతుందని, క్షేత్రాల దర్శనం అనంతరం 13న సాయంత్రం 6గంటలకు తిరిగి కర్నూలుకు చేరుకుంటుందని, 2+2 పుష్ బ్యాక్ సీట్ల ఈ సూపర్ లగ్జరీ బస్సులు యాత్రకు రానుపోను చార్జీ రూ.4వేలు ఉంటుందని, ఇందులో ముందస్తుగా టికెట్లు పొందే వీలు కల్పించినట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్ 77027 74358 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



వ్రతంలో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం పౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రమా సహిత సత్యనారాయణ వ్రతాలు విశేషంగా నిర్వహించారు. పండితులు భక్తులకు సందేశమిచ్చి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి

కర్నూలు (టౌన్): నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో నివసించే రాఘవేంద్ర స్థానిక పెద్దమార్కెట్ బాలికల ఉర్దూ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం వ్యక్తిగత పని మీద ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఈమేరకు మృతుడి భార్య వెంకటేశ్వరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

కర్నూలు (టౌన్): పత్తికొండ టౌన్‌కు చెందిన మురళీ (23) కర్నూలు నగరంలోని చెన్నమ్మ సర్కిల్‌లో నివసిస్తున్నాడు. వృత్తిరీత్యా డ్రైవర్. కర్నూలు పట్టణానికి చెందిన అంబికా అనే యువతిని 2021 సంవత్సరంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. బళ్లారిలో కాపురం పెట్టాలనే విషయంలో ఇరువురి మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయంపై ఆదివారం మరోసారి గొడవ జరగడంతో తీవ్ర మనస్థాపానికి గురైన మురళీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అక్క శిరీషా ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు (టౌన్): బండిమెట్టలో నివసించే ఖాజాబాషా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈయనకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు. పెద్దకూతురుకు వివాహమైంది. రెండవ కూతురుకు పెళ్లి కుదిరింది. అయితే, డబ్బుల సమస్య ఉండటంతో తీవ్ర మనస్థాపం చెందాడు. గత నెల 29 వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భార్య రెహనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సప్లయర్స్ షాపులో అగ్నిప్రమాదం

ఆలూరు రూరల్: పట్టణంలోని కర్నూలు–బళ్లారి ప్రధాన రహదారిలోని ఓ సప్లయర్స్ షాపులో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు నాగరాజు వాపోయాడు. ఆదివారం ఉదయం 6 గంటలకు షాపులో భారీ ఎత్తున మంటలు చెలరేగడంతో షామియానాలు, డెకరేషన్ సామగ్రితో పాటు ఇతర సప్లయర్స్ సామగ్రి కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలు అదుపు చేయడంతో ప్రాణ నష్టం తప్పింది. షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్నిప్రమాదం జరిగినట్లు ఫైర్ అధికారి ఖాద్రి తెలిపారు.